## క్లుప్తంగా

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభించిన విష్ణువర్ధన్‌రెడ్డి

మోమిన్‌పేట: మండల పరిధిలోని టేకులపల్లిలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పీఏసీఏస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బస్టాండ్ నుంచి శివాలయం వరకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. అలాగే, భూగర్భ మురుగు కాల్వ నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. శిథిలమైన మురుగుకాల్వలను మరమ్మతులు చేపట్టి శుభ్రంగా చేశామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రైయిస్, గ్రామస్తులు శ్రీనివాస్, పరుశురాం తదితరులు ఉన్నారు.

### పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం



పాఠశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

కుల్కచర్ల: గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనిస్తామని కుల్కచర్ల ఎంపీడీఓ కరీం, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కుల్కచర్ల, ముజాహిద్‌పూర్ గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందికి తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల జీపీ సిబ్బంది ఉన్నారు.

### నర్సరీ సందర్శన



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

వికారాబాద్: మండల కేంద్రంలోని నర్సరీని ఎంపీడీఓ రాములు మంగళవారం సందర్శించి, మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని ప్రతి గ్రామంలో 4500 మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. త్వరలోనే వనమహోత్సవం కార్యక్రమాన్ని ఊరూర పండుగలా నిర్వహిస్తామన్నారు. ప్రతి నర్సరీల్లో 18రకాల మొక్కలు సిద్ధంగా ఉంచామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో గుంతల తవ్వకం పనులు జరుగుతున్నాయని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు సంరక్షణ చర్యలు చేపడుతామన్నారు. ఎంపీడీఓ వెంట బంట్వారం పంచాయతీ కార్యదర్శి గోపాల్ ఉన్నారు.

### స్వల్పకాలిక వరి వంగడాలు సాగు చేయాలి

బొంరాస్‌పేట: వానకాలంలో స్వల్పకాలిక వరి వంగడాల సాగుచేయాలి. దీంతో పంటనష్టం లేకపోవడం, పెట్టుబడి తగ్గడం, దిగుబడి పెరుగి రైతులకు లాభసాటిగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఉ. 9.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వానకాలంలో స్వల్పకాలిక వరి వంగడాల సాగు, ప్రస్తుత పంటల్లో కలుపు యాజమాన్యం పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తల బృందంతో చర్చాగోష్ఠి ఉంటుందన్నారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఇందులో బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్ వ్యవసాయాధికారిణిలు అనురాధ,లావణ్య, ఏఈఓలు, రైతులు ఉన్నారు.

### తాండూరు ఆర్టీసీ డీఎంగా సురేష్ కుమార్


తాండూరు టౌన్ : తాండూరు ఆర్టీసీ డీపో మేనేజర్‌గా సురేష్ కుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సమత దిల్‌సుఖ్‌నగర్‌కు డిపో డీఎంగా బదిలీ అయ్యారు. తాండూరుకు వచ్చిన నూతన డీఎం సురేష్ కుమార్ ఉప్పల్ డిపో నుంచిఇక్కడికి బదిలీపై వచ్చారు.

### ఉపాధ్యాయుడికి సన్మానం


కొడంగల్ : మండలంలోని హుస్సేన్ పూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా పనిచేస్తున్న బాకారం మల్లయ్యను గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. ఆయన బొంరాస్‌పేట జెడ్పీహెచ్ఎస్‌కు పదోన్నతిపై బదిలీ అయ్యారు. పాత కొడంగల్ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న క్రాంతికుమార్ బదిలీపై హుస్సేన్‌పూర్‌కు వచ్చారు.

# మెసేజ్ వచ్చింది.. డబ్బులు జమ కాలే..

- కళ్యాణలక్ష్మి చెక్కుతో తిప్పలు
- కాలం చెల్లిన చెక్కులు పంపిణీ
- తిరిగి తీసుకున్న రెవెన్యూ అధికారులు
- ఆందోళనలో బాధితులు




జమ అయినట్లు వచ్చిన మెసేజ్




బాధితురాలికి ఇచ్చిన కళ్యాణలక్ష్మి చెక్కు

దుద్యాల్: కళ్యాణలక్ష్మి చెక్కు బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు మేసేజ్ వచ్చింది. కానీ, డబ్బులు మాత్రం జమ కాలేదు. బాధితురాలు వివరాల ప్రకారం.. దుద్యాల్ మండలంలోని కుదురుమల్ల గ్రామానికి చెందిన బొర్ర వెంకటమ్మ, వెంకటయ్య కూతురు బొర్ర నవనీతకు గత ఏడాది క్రితం వివాహం కాగా, ప్రోత్సాహం కింద ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా రూ.1,00,116ల (చెక్కు నంబర్ 057980, చెక్కు తేదీ 21-03-2024) జూన్ 11న బొర్ర వెంకటమ్మకు అధికారులు ఇచ్చారు. అదే రోజు కొడంగల్ ఆంధ్రాబ్యాంకులో జమ చేశారు. ఇచ్చింది ఎస్‌బీఐ చెక్ కావడంతో ఆంధ్రబ్యాంకు ఖాతాలో జమ చేయాలంటే 10 రోజుల సమయం పడుతుందని , మీకు ఖాతాలో జమ అయినట్లు మెసేజ్ వస్తుందని బ్యాంకు అధికారులు చెప్పడంతో బాధితులు సరే అని వెళ్లిపోయారు. జూన్ 21న ఖాతాలో రూ.1,00,116 జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. కానీ డబ్బులు జమ కాక పోవడంతో బాధితులు వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించగా చెక్కుకాలం చెల్లిందని వివరణ ఇచ్చారు. దీంతో ఆందోళనకు గురైన బాధితురాలు బొర్ర వెంకటమ్మ తాండూరు ఆర్‌డీఓ కార్యాలయంలో సంప్రదించగా, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. దీంతో దుద్యాల్ తహసీల్దార్‌ను కలవగా చెక్కును తిరిగి తీసుకున్నారు. దీంతో మరో చెక్కు వస్తుందో లేదో అని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై దుద్యాల్ మండల తహసీల్దార్ దానయ్యను వివరణ కోరగా బాధితురాలు దగ్గర నుంచి చెక్కును తీసుకుని తాండూరు ఆర్డీఓకు ఇచ్చామని .. వేరే చెక్కు రెన్యూవల్ చేసి త్వరలోనే అందిస్తామని చెప్పారు.

### ఇబ్బంది పెట్టడం సరికాదు...



నా కుమార్తెకు అప్పు చేసి పెళ్లి చేసిన. ప్రభుత్వ సహాయం అందుతుందనే ఆశతో ఇన్నాళ్లుగా ఎదురు చూశాం. చెక్కు రానే వచ్చింది. కానీ ఇచ్చిన చెక్కు కాలం చెల్లిందని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఖంగుతిన్న. చెల్లిన చెక్కులను పెదలకు ఇచ్చి , ఇబ్బందులకు గురిచేయొద్దు. మళ్లీ నాకు చెక్కు వస్తదో.. రాదోనని భయంగా ఉందని, బాధితురాలు వెంకటమ్మ వాపోయారు.

– బొర్ర వెంకటమ్మ

# రైతుల సమస్యల పరిష్కారంలో విఫలం

బీజేపీ నేత వెంకటయ్య



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: రైతాంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్యగౌడ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ఏకకాలంలో రుణమాఫీ హామీ ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. రైతుభరోసా పథకం వస్తుందో, రాదో తెలియని దుస్థితి ఏర్పడింది. హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో బీజేపీ ఆ. ద్వర్యంలో ఆందోళన చేస్తామ ని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సురేష్, అంజి లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మైపాల్, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జానకీరాం పాల్గొన్నారు.

**హామీలు నెరవేర్చాలి**

పరిగి: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ కిసాన్ మోర్చా పిలుపు మేరకు బీజేపీ నేతలు మంగళవారం రైతుల సమస్యలపై తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రైతుబంధు రూ.15 వేలకు పెంచుతామని ఎలాంటి ప్రకటన లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రుణమాఫీ అమలు చేయండి**

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరు తూ మంగళవారం బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా ఆదేశాల మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ.. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు బంధు ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని, పంటల బీమా యోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా నాయకులు పాండురంగం, జిల్లా నాయకులు మోహన్ రెడ్డి, తదితరులున్నారు.

## జర్నలిస్టులను ఆదుకోండి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసాచారి

తాండూరు టౌన్ : జర్నలిస్టులను ఆర్థికంగా ఆదుకోవాలని టీయూడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి కోరారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి సమాచార, ప్రసార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసా చారి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనారోగ్యం పాలైన జర్నలిస్టులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, స్థలం ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం అందజేయాలన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ పెట్టేలా జీఓ తీసుకురావాలన్నారు. అలాగే ఉత్తమ జర్నలిస్టుల అవార్డులను ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు. జిల్లాకు చెందిన సీఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు.

# వేళకు బస్సులు నడపాలంటూ ఆందోళన



తాండూరు ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళనకు చేస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిపో ఎదుట బైఠాయింపు

తాండూరు టౌన్ : పాఠశాలలు, కళాశాలల వేళలకు అనుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులు తాండూరు ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళనకు దిగారు. డిపో ఎదుట బైఠాయించి, డీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయులు మాట్లాడుతూ .. పాఠశాలలు, కళాశాలల సమయాలకు అనుకూలంగా బస్సులు నడపకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గ్రా మాల బస్టాండ్‌ల వద్ద డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని, దీంతో ఆరోజు కళాశాలకు వెళ్లలేక పోతున్నారని మండిపడ్డారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు అనుకూలంగా బస్సులను నడపాలని డీఎం సమతకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కళాశాలల వేళలకు అనుకూలంగా బస్సులు నడపాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. సాయంత్రం ఆలస్యంగా బస్సులు నడపడంతో ఇంటికి రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండులో మూత్రశాలలు, తాగునీరు, సరైన సౌకర్యాలు సరిగా లేవన్నారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత

ఎస్ఐ విఠల్‌రెడ్డి



యాలాల: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాల ఘటనలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలతో పాటు వాట్సాఫ్, ఫేస్ బుక్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయం, ఫొటోల షేరింగ్ తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, కుటుంబ వివరాలను ఎట్టి పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాల్లో పెట్టరాదని సూచించారు. అనవసరమైన లింకులను క్లిక్ చేసి కష్టాలను కొనితెచ్చుకోకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను గుర్తుంచుకోవాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ నడుం బిగించాలని కోరారు.

## తగ్గిన కూరగాయ ధరలు

పెద్దేముల్: కూరగాయ ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. గత పది రోజుల క్రితం ఏ కూరగాయలు కొనాలన్నా రూ.100 నుంచి రూ. 120 వరకు ధర కిలో పలికింది. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వారాంతపు సంతలో పలు రకాల కూరగాయలు ప్రస్తుతం రూ. 60 నుంచి రూ.80 వరకు ధర పలుకుతుంది. పచ్చి మిర్చి రూ.60 నుంచి రూ. 70 కిలో, బీరకాయ రూ.60 కిలో, కాకర.రూ.80కిలో, చిక్కుడురూ.60 కిలో,ఆకుకూరలు రూ.40 కిలో పలుకడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

## వేగవంతం చేయండి

ఎంపీడీఓ రాములు

బంట్వారం: అమ్మఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్ఎంలకు పలు సూచనలు చేశారు. సంబంధిత చైర్మన్‌లతో మాట్లాడి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. పనులను బట్టే బిల్లుల చెల్లింపులు ఉంటాయన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్ల విషయంలో రన్నింగ్ వాటర్ ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఏఈ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి గోపాల్, ఏపీఎం దేవయ్య, హెచ్ఎంలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



సమ్మెనోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

తాండూరు రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. మంగళవారం సీడీపీడీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. 60 సంవత్సరాలు తర్వాత వీఆర్ఎస్ తీసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం కల్పించుకొని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని సీడీపీఓ కార్యాలయంలో సమ్మెనోటీసు అందజేశారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

అనంతగిరి: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బసవరాజు అన్నారు. మంగళవారం వికారాబాద్లో జిల్లా ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగదు రహిత వైద్య సేవలను వెంటనే అమలు చేయాలన్నారు. నాలుగు కరువు భత్యాలను మంజూరు చేయాలని కోరారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి నివేదిక చదివి వినిపించగా సభ్యులు అందరూ ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి మల్లయ్య, వికారాబాద్ యూనిట్ అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు పలువురు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ బైలెల్లినాదో!

దౌల్తాబాద్: అమ్మ బైలెల్లినాదో..పోచమ్మ బైలెల్లినాది అంటూ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా పోచమ్మ బోనాల పండుగ జరుపుకొన్నారు. ఉదయం అమ్మవారికి జల్దిబిందె కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బోనాలతో మహిళలు పోచమ్మ అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా ఆషాఢమాసంలో బోనాల పండుగను ఘనంగా జరుపుకోవడంతో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

**వైభవంగా బోనాల జాతర**

తాండూరు: పట్టణంలోని సాయిపూర్ తాతగుడి దేవాలయంలో బోనాల జాతర వైభవంగా జరిగింది. సాయిపూర్ ప్రాంతంలోని భక్తులు తాతాగుడిలో ప్రత్యేక పూజలు చేశారు . ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. శివసత్తుల పునకాలు, పోతరాజుల విన్యాసాలతో జాతర భక్తజన సంద్రంగా మారింది. ఊరేగింపుగా తాతాగుడికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పటోళ్ల దీపనర్సింహులు దంపతులు బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించారు.



బోనాలతో మహిళలు

## ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ కోసం సర్వే



పాత కొడంగల్ శివారులో సర్వే చేస్తున్న సిబ్బంది

కొడంగల్ : మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామ శివారులో ఇంట్రిగ్రేటెడ్ క్యాంపస్ కోసం అధికారులు మంగళవారం సర్వే చేశారు. ప్రస్తుతం ఉన్న గిరిజన గురుకుల పాఠశాల సమీపంలో ప్రభుత్వ స్థలం ఉంది. అక్కడ సాంఘీక సంక్షేమశాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు ఆధునాతన వసతులతో కొత్త భవనాలు నిర్మించనున్నారు. ఒకే చోట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. భవిష్యత్తులో పాత కొడంగల్ గ్రామం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ క్యాంపస్‌కు వేదిక కానుంది. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నూతన భవనానికి రూ.20 కోట్లు మంజూరు చేశారు.

## మిడ్ డే మీల్స్ పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అధికారులు మంగళవారం మిడ్ డే మీల్స్‌ను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కావునా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. క్రమం తప్పకుండా మెనూ ప్రకారం వండాలన్నారు. అలాగే పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

పెద్దేముల్: అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రత పాటించాలని తాండూరు డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల మంబాపూర్, మదనంతపూర్, రుద్రారం, ఆత్కూర్ గ్రామాలను సందర్శించి జీపీల్లో పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంబాపూర్ గ్రామ శివారులో ఉన్న జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ వంట గది, తాగునీటి ట్యాంకు, వంటశాలను తనిఖీ చేశారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని అక్కడ అధికారులకు తెలియజేశారు. డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో సిబ్బందిపై మండిపడ్డారు. మళ్లీ వారంలో ఓ రోజు తనిఖీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే, ప్రతి జీపీలో సరిహద్దుల వద్ద గ్రామాల బోర్డు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వారితో పాటు ఎంపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు సంజీవ్‌కుమార్, నరేష్‌కుమార్, ఆనంద్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ హెచ్ఎం జైపాల్‌రెడ్డికి సన్మానం**

తాండూరు రూరల్: మండల పరిధిలోని పర్వాతపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల్లో పని చేసి పదోన్నతిపై వెళ్లిన హెచ్ఎం జైపాల్‌రెడ్డిని విద్యార్థులు సన్మానించారు. మంగళవారం పర్వాతపూర్ పాఠశాల వరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జైపాల్‌రెడ్డి గత కొన్ని సంవత్సరాల నుంచి పాఠశాల్లో విద్యార్థులకు విద్యాబోధన చేశారు. గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు అందరూ కలిసి ఆయనను శాలువపూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చెంగోల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సర్యానాయక్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కిష్టప్ప, మాజీ సర్పంచు లాల్‌రెడ్డి ,మాజీ ఉప ర్పంచు నర్సింహారెడ్డి ,పీఆర్‌టీయూ మండల కార్యదర్శి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

**◆ వెంటనే పరిష్కరించాలి**

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరాహార దీక్షకు చంద్రయ్య సంఘీభావం తెలిపి మాట్లాడారు. రిటైర్మెంట్ అవుతున్న అంగన్వాడీ టీచర్లకు రూ. 2 లక్షల బెనిఫిట్స్ హెల్పర్లకు రూ. 1 లక్ష బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు.

**◆ ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం**

దుద్యాల్ : మండలంలోని కుదురుమల్ల గ్రామంలో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏబీవీపీ గ్రామశాఖ ముఖ్య కార్యకర్త బొర్ర రవికుమార్ మాట్లాడుతూ.. ఏబీవీపీ విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందన్నారు.

**◆ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి**

పరిగి: విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ ఎనలేని కృషి చేసిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిగణేష్ అన్నారు. మంగళవవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముగ్గురితో ప్రస్థానం ప్రారంభించి నేడు కోట్ల మంది విద్యార్థులు సంఘంలో పని చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పరిగిశాఖ నాయకులు గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

**◆ ముందుండి పోరాడుతాం**

అనంతగిరి: విద్యార్థుల ఉద్యమంలో ఏబీవీపీ ఎప్పుడు ముందుంటుందని ఈ- పాలమూరు విభాగ్ సంఘటన మంత్రి నరేంద్ర అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో విద్యార్థులతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీ విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. జ్ఞానం శీలం, ఏకాగ్రత ఏబీవీపీ ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా ఇన్చార్జి హరీష్ రావు, నాయకులు మహేష్ ఆది కేశవ్ రాజేందర్ కార్తీక్ అనిల్ శ్రీధర్ శ్రీశైలం హర్షవర్ధన్ సంతోష్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

**◆ ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది**

బంట్వారం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. కోట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను చంద్రప్ప మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... ఉద్యోగరీత్యా బదిలీలు, పదవీ విరమణలు సహజమేనన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. అలాగే నూతన ఉపాధ్యాయులను ఎంఈఓ గౌరవప్రదంగా సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు శ్రీధర్‌రెడ్డి, గోపాల్, సంతోష్‌కుమార్, ఖలీమోద్దిన్, వెంకట్ రావు, ఉమామహేశ్వరి, కృష్ణయ్య పాల్గొన్నారు.